## క్లుప్తంగా

### సుబ్బారెడ్డి సేవలు చిరస్మరణీయం

గుంటూరు ఎడ్యుకేషన్: వృత్తి బాధ్యతలు అంకితభావంతో పని చేసిన శ్యామల సుబ్బారెడ్డి సేవలు చిరస్మరణీయమని ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు పేర్కొన్నారు. పేరేచర్ల జెడ్పీ హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడిగా పని చేస్తూ ఇటీవల మృతి చెందిన శ్యామల సుబ్బారెడ్డి సంస్మరణ సభను మంగళవారం కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు మాట్లాడుతూ విద్యారంగాభివృద్ధిలో తన వంతు పాత్ర పోషించడంతో పాటు ఎస్టీయూ నిర్మాణానికి, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలోనూ సుబ్బారెడ్డి విశేష కృషి చేశారని కొనియాడారు. ప్రధాన కార్యదర్శి డీకే సుబ్బారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిలర్లు కె.శ్రీనివాసరావు, ఎంపీ సుబ్బారావు, శ్యాంబాబు, పి.ప్రసాద్, రవికాంత్, సుందర్‌రావు, శ్రీనివాసరావు, ఎస్డీ జహంగీర్, వీరేంద్రప్రసాద్, చంద్రకుమార్, విజయ్‌కుమార్, రమేష్ నాయక్ పాల్గొన్నారు.

### ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం



గుంటూరు రూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలను ప్రజలకు అందిస్తున్నారని 40వ డివిజన్ కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని పెదపలకలూరు గ్రామంలో డివిజన్‌లో నూతనంగా మంజూరైన 65 వితంతు, వృద్ధాప్య, వికలాంగ పింఛన్‌లను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ పిల్లి నాగేశ్వరరావు, ముత్యాల శ్రీనివాసరావు, షేక్ బుజ్జి, షేక్ జానీ, పసుమర్తి ఏలియా టి.శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, బంగారయ్య, జనార్దన్ పాల్గొన్నారు.

### ప్రజాసంఘాల నిరసన



పెదకాకాని: వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని నిరసన తెలియజేస్తున్న రైతులను కారుతో తొక్కించి చంపడానికి నిరసనగా మంగళవారం పెదకాకానిలో బ్లాక్ డే నిర్వహించారు. ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గ ఏఐటీయూసీ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, గుంటూరు జిల్లా సీఐటీయూ కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడారు. కార్యక్రమంలోమహిళా సమైక్య కార్యదర్శి రెంటాల కుమారి, అగ్రిగోల్డ్ బాధితుల సంఘం జిల్లా కార్యదర్శి కేతినేని అగస్టీన్, ఆర్.బాబూరావు, సిహెచ్.విజయలక్ష్మి, కోటిపల్లి సత్యనారాయణ, వి.శివయ్య, నీలాంబరం, బాబూరావు, బాలయ్య, మోహన్ పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ యువకుడి మృతి

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మంగళవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నరహరి తెలిపిన వివరాలు.. తోకావారిపాలెం గ్రామానికి చెందిన వేల్పూరి తంబి(31) ద్విచక్ర వాహనంపై పేరేచర్ల వెళుతున్నారు. ఈ క్రమంలో చిన్నపలకలూరు సమీపంలో పేరేచర్ల వైపు నుంచి వస్తున్న కారు మితిమీరిన వేగంతో తంబి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో తంబికి తీవ్రగాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి పుల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడిన ఘటన నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు.. కేవీపీ కాలనీకి చెందిన షేక్ నజీరుద్దీన్ ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. ఈక్రమంలో వెనుకగా వస్తున్న కారు మితిమీరిన వేగంతో ఢీకొనడంతో నజీరుద్దీన్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్పందించిన స్థానికులు అతడిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. జీజీహెచ్‌లో నజీరుద్దీన్‌ను పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. ఘటనపై బాధితుడి తండ్రి సలీమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

### మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అరెస్ట్ చేశారు. తెనాలి మండలం అంగలకుదురులో అనధికారికంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏబీ చలం, సిబ్బంది మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రామానికి చెందిన ఎస్.బాబర్ వద్ద 13 క్వార్టరు సీసాలు లభించాయి. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ చలం తెలిపారు.

# ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం



మందులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, కమిషనర్ కీర్తి చేకూరి



పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే గిరి, పక్కన డిప్యూటీ మేయర్ సజీల

- తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు ముస్తఫా, గిరిధర్
- జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

నెహ్రూనగర్: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా పేర్కొన్నారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని బొంగరాలబీడు వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద వైద్యశిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా జీవించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. అందుకే ఆరోగ్యశ్రీలో కూడా గతం కంటే ఎక్కువ వ్యాధులకు చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. నగరంలో 29 పట్టణ ఆరోగ్య కేంద్రాల ద్వారా పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తుండగా, జగనన్న సురక్ష క్యాంప్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు వైద్యం కోసం ఎటువంటి ఇబ్బందులు పడకుండా చేయిపట్టుకుని నడిపించేలా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా మెరుగైన వైద్యం అందించడంతో పాటు అవసరమైన వారికి ఆస్పత్రుల్లో వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారని వివరించారు.

కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా నగర ప్రజల ఆరోగ్య సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని చెప్పారు. క్యాంప్‌లో మహిళలకు, పురుషులకు ప్రత్యేక కౌంటర్లు, ప్రతి కౌంటర్ వద్ద సమాచారం కోసం వార్డు సచివాలయ కార్యదర్శిని నియమించినట్లు వివరించారు. మందులు ఇచ్చేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని చెప్పారు. ఇంటి వద్ద రిజిస్ట్రేషన్ ఫారాలు ఇచ్చామని, క్యాంప్‌లో కూడా స్పాట్ రిజిస్ట్రేషన్ చేసి తగిన వైద్య పరీక్షలు చేస్తున్నారని, ఎవరికైనా ఉన్నత వైద్యం అవసరమైతే ప్రభుత్వ, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్‌కు రిఫర్ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

క్యాంప్‌లో జనరల్ మెడిసిన్ స్పెషలిస్ట్, గైనకాలజిస్ట్‌తో పాటుగా ఇద్దరు ఎంబీబీఎస్ డాక్టర్లు అందుబాటులో ఉంటారన్నారు. క్యాంప్ ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకటకృష్ణయ్య, సిహెచ్.శ్రీనివాస్, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, ఈఈ కోటేశ్వరరావు, మేనేజర్ శివన్నారాయణ, కార్పొరేటర్ పాపతోటి అంబేడ్కర్ పాల్గొన్నారు.

# అర్హతే ప్రామాణికంగా సంక్షేమం

- తూర్పు ఎమ్మెల్యే ముస్తఫా
- 15వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం



కరపత్రాలను అందజేస్తున్న నూరిఫాతిమా, ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత అందరికి సంక్షేమం, అభివృద్ధి తీసుకెళ్లారని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్‌ముస్తఫా, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా చెప్పారు. నియోజకవర్గంలోని 15వ డివిజన్ పరిధిలోని ఎల్ఆర్ కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవటంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రతి ఇంటికి జరిగిన సంక్షేమాన్ని వివరిస్తూ.. కరపత్రాలను పంపిణీ చేశారు. స్థానికంగా కొంత మంది ఎమ్మెల్యే ముస్తఫా దృష్టికి తీసుకుని వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా, నూరిఫాతిమా మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లో పరిపాలన పరంగా అనే విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతోందని చెప్పారు. విద్యా, వైద్యాన్ని పేదలకు దరి చేర్చటంతో పాటు, లక్షలాది మంది మహిళలకు సొంతింటి కలను నిజం చేశారన్నారు. అనేక కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం, అధికారులు అంటే ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలని చాటిచెప్పారని వివరించారు. రానున్న ఎన్నికల్లో తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, స్థానిక కార్పొరేటర్ రామనబోయిన అజయ్‌యాదవ్, వాకా శ్రీనివాస్ రెడ్డి, మద్దిరెడ్డి సుధాకర్ రెడ్డి, పాణ్యం మురళీ, మారెడ్డి హనుమాయమ్మ, శ్రీకాంత్ రెడ్డి, అంజిరెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం



మున్నంగి అన్నపూర్ణను సత్కరిస్తున్న అవగాహన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: ఆధునిక వైద్య ప్రగతిలోనూ జీవనశైలి మార్పులతోనూ ప్రణాళికాబద్ధమైన జీవితంతో వృద్ధాప్యంలో కూడా ఆరోగ్యంగా ఆహ్లాదకరంగా ఉండవచ్చని డాక్టర్ ఏ సృజన్ కుమార్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. డాక్టర్ సృజన్‌కుమార్ మాట్లాడుతూ వృద్ధాప్యం శాపం అనుకోవడం మానసికంగా కృంగిపోవటం డిప్రెషన్‌కిలోను కావటం పనికిరాదన్నారు. యవ్వనంలో ఎంత హుషారుగా ఉన్నారో వృద్ధాప్యంలో కూడా అలాగే ఆరోగ్యంగా ఆహ్లాదంగా ఉండవచ్చన్నారు. అనంతరం దేశ విదేశాల్లో ఉన్న వారికి సంగీత క్లాసులు నిర్వహిస్తూ వేలాది మంది శిష్యుల అభిమానం పొంది 84 ఏళ్లవయసులో ఇప్పటికీ కూడా సంగీతాన్ని బోధిస్తున్న మున్నంగి అన్నపూర్ణను సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, విశ్రాంత వైస్ ప్రిన్సిపాల్ వి.జయ, అనవేమా ట్రస్ట్ అధ్యక్షుడు అంజిరెడ్డి తదితరులు ఘనంగా సత్కరించారు.

# ఓటరు సర్వే సక్రమంగా చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న హరిహరనాథ్

పొన్నూరు: నియోజకవర్గంలో చేపడుతున్న ఓటరు సర్వే సక్రమంగా నిర్వహించాలని ఓటరు నమోదు అధికారి హరిహరనాథ్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు సర్వేపై నియోజకవర్గ పరిధిలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. రాజకీయ నాయకుల నుంచి వచ్చిన అభ్యంతరాలను వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని సహాయ ఓటరు నమోదు అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ప్రజలు ఓటు వేసేందుకు వీలుగా 27 పోలింగ్ బూత్‌లను మార్పు చేసే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీల నుంచి అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు చెప్పారు. ఈనెల 27న ఓటర్ల నమూనా జాబితా విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. దానిపై డిసెంబర్ 9 వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. జనవరి 5న ఓటర్ల తుది జాబితా విడుదల చేయనున్నట్లు ఈఆర్ఓ హరిహరనాథ్ తెలిపారు. సమావేశంలో కమిషనర్ నయీమ్ అహ్మద్, తహసీల్దార్ కే శ్రీకాంత్, డీటీ ఫణి కుమార్, సీనియర్ అసిస్టెంట్ ఆనందరావు పాల్గొన్నారు.

# వీఐటీ- ఏపీలో సంగీత కచేరి



వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్‌చంద్రతో సంగీత కచేరీలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

తాడికొండ: తుళ్లూరు మండలం ఐనవోలు వీఐటీ-ఏపీలో మంగళవారం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, ఇన్నోవేషన్, ఇంక్యూబేషన్, ఎంటర్‌ప్రెన్యూర్ సెల్ సహకారంతో హార్మోనీ అనలిస్ట్ అనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంగీత కచేరి నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అర్జిత్‌సింగ్ పాడిన సోను నిగమ్ కల్ హో నాహో, సిద్ శ్రీరామ్ పాడిన యువన్ శంకర్ రాజా నీ యదలో నాకు, శ్రేయ ఘోషల్ పాడటానికి శ్వేతా మోహన్ రాసిన వా వాతి పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి.

విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి, రిజిస్ట్రార్ జగదీష్ చంద్ర ముదిగంటి మాట్లాడుతూ భారతదేశపు మొట్టమొదటి కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఉపయోగించి సంగీత కచేరి నిర్వహించడం అభినందనీయమన్నారు. సంగీత ప్రపంచంలో సాంకేతికత, ఆవిష్కరణల శక్తికి ఈ సంఘటన నిజమైన నిదర్శనమన్నారు. కార్యక్రమంలో భాగంగా నల్ చాప్టర్ ప్యాట్రన్ కో ఆర్డినేటర్ డాక్టర్ సీబీ చక్రవర్తి సాంకేతికత, సృజనాత్మకత అద్భుత కలయికతో రూపొందించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మ్యూజిక్ వీడియోలు ప్రదర్శించారు. నల్ చాప్టర్ ప్రెసిడెంట్ వెంకట్ హర్ష రాయసం, వైస్ ప్రెసిడెంట్ కె.ప్రణవ్ సాయి, సంజయ్ సహకారాన్ని అభినందించారు. కార్యక్రమంలో వర్సిటీ డైరెక్టర్ ఐఐఈసీ డాక్టర్ అమీత్ చవాన్, డాక్టర్ హరిసీత, డాక్టర్ శిబి చక్రవర్తి, ప్రొఫెసర్ శామ్యూల్ జాన్సన్ డాక్టర్ సుధాకర్ ఇలంగో, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

### కోబాల్డుపేటలో అన్నదానం



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే గిరి

పట్నంబజారు: ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఏఆర్ యూఆర్ యూత్ నాయకులు ఆజం మాలిక్, చల్లా కోటి ఆధ్వర్యంలో మంగళవారం కోబాల్డుపేటలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ ప్రారంభించారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, గుంటూరు క్లస్టర్ ఇన్‌చార్జి నూనె ఉమామహేశ్వరరెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు. పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య ఆధ్వర్యంలో దేవపురంలో మహిళలకు చీరల పంపిణీ చేయగా, డీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు(లాలుపురం రాము) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ గనిక జాన్సీ ఆధ్వర్యంలో మంగళవారం గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంచిపెట్టగా, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా ముఖ్యఅతిథిగా హాజరై పంపిణీ చేశారు.

### క్షయ వ్యాధిపై అవగాహన

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ డాక్టర్ పి.రవికుమార్ మాట్లాడుతూ క్షయవ్యాధి అంటువ్యాధి అని, ఒకరి నుండి మరొకరికి వ్యాప్తి చెందుతుందని వివరించారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా మందులు అందజేస్తుందని తెలిపారు. వ్యాధిగ్రస్తులు పౌష్టికాహారాన్ని తీసుకుంటూ ప్రతి రోజూ వ్యాయామం చేయడం ద్వారా త్వరగా కోలుకుంటారని అన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

### ఫిరంగిపురంలో అమృత కలశయాత్ర

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం అమృత కలశ యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు డి.కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్ షహేలానర్గీస్, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, జి.చంద్రం, పి.జేమ్స్ఇన్నయ్య, ఎంపీడీఓ డి.అనూరాధ, ఈవోపీఆర్డీ నిర్మలాలక్ష్మీకుమారి, కె.చిన్నప్పరెడ్డి, మేడా బాబు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ఆటో

మంగళగిరి: మండలంలోని చినకాకాని వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడితో సహా ద్విచక్రవాహనం మురుగు కాలువలోకి దూసుకెళ్లిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మంగళగిరి నుంచి గుంటూరు ద్విచక్రవాహనంపై వెళుతున్న యువకుడిని చినకాకాని వంతెన వద్ద ఆటో ఢీకొట్టింది. అదుపు తప్పిన ద్విచక్రవాహనం యువకుడితో సహా మురుగు కాలవలోకి దూసుకెళ్లింది. గమనించిన స్థానికులు వెంటనే యువకుడిని బయటకు తీశారు. దెబ్బలు తగలడంతో ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ద్విచక్రవాహనం వెలికి తీసి ప్రమాద వివరాలను సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యువకుడి వివరాలు తెలియరాలేదని ప్రాణాప్రాయం ఏమీ లేదని చిన్నపాటి దెబ్బలు తగలడంతో గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

### రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

తెనాలిరూరల్: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల అందించిన వివరాలు.. తెనాలి- విజయవాడ రైలు మార్గంలోని కొలకలూరు స్టేషన్ సమీపంలో సుమారు 35 నుంచి 40 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి మంగళవారం రైలు ఢీకొట్టడంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు పాల్పడ్డాడా లేక ప్రమాదవశాత్తు రైలు ఢీకొట్టిందా అన్న అంశంపై స్పష్టత లేదని పోలీసులు తెలిపారు.

### స్రవంతికి అభినందనలు

ఫిరంగిపురం: మండలంలోని పొనుగుపాడు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఎ.స్రవంతి ఇటీవల కర్నూలు జిల్లా మహానందిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో జిల్లా తరుపున పాల్గొంది. పోటీలో తృతీయ స్థానం సాధించింది. పాఠశాలలో మంగళవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో హెచ్ఎం సాంబశివరావు, పీడీ శ్రీనివాసరావు పాల్గొని స్రవంతిని అభినందించారు.

# వైఎస్సార్ సీపీకి ప్రజల్లో విశేష ఆదరణ

ఎమ్మెల్యే ముస్తఫా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముస్తఫా, వేదికపై నూరిఫాతిమా

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ చేపట్టే ప్రతి కార్యక్రమానికి ప్రజల్లో విశేష ఆదరణ లభిస్తోందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా పేర్కొన్నారు. ఈ నెల 11వ తేదీ నుంచి నవంబర్ 11వ తేదీ వరకు జరగనున్న 'వై ఏపీ నీడ్స్ జగన్'' అనే నినాదంతో నిర్వహించనున్న కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకుని వెళ్లేందుకు పార్టీ శ్రేణులు, కార్పొరేటర్‌లు, డివిజన్ అధ్యక్షులు పాటుపడాలని సూచించారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం పార్టీ ముఖ్య నేతలు, కార్పొరేటర్‌లు, డివిజన్ అధ్యక్షులతో సమావేశం నిర్వమించారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో వ్యవస్థలన్నింటిని నిర్వీర్యం చేశారని, రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పగ్గాలు చేపట్టిన తరువాత తీసుకున్న నిర్ణయాలు, ప్రతి అంశంలో చేపట్టిన అభివృద్ధి, ప్రతి ఇంటికి చేరువైన సంక్షేమాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకునేలా అనేక సంక్షేమ పథకాలు చేపట్టిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని వివరించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేసి రానున్న ఎన్నికల్లో భారీ మెజారిటీతో తూర్పు నియోజకవర్గాన్ని గెలిపించుకొని జగనన్నకు బహుమతిగా ఇవ్వాలని అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# ప్రజలకు వైద్యం చేరువ చేసిన ఘనత సీఎం వై.ఎస్. జగన్‌దే



డాక్టర్ శివరామ్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, డొక్కా మాణిక్య వరప్రసాద్

పట్నంబజారు: సమాజంలో వైద్యుల పాత్ర ఎంతో కీలకమని శాసనమండలి సభ్యుడు, వైఎస్సార్ సీపీ గుంటూరు, కృష్ణా జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీలో జోన్-4 జోనల్ ఇన్‌చార్జిగా నియమితులైన డాక్టర్ కొల్లి శివరామ్‌రెడ్డి మంగళవారం బృందావన్ గార్డెన్స్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, డొక్కా మాణిక్య వరప్రసాద్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పదవి వచ్చిన డాక్టర్ శివరామ్‌రెడ్డిని దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ రాజశేఖర్, డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ వైద్య రంగంలో విప్లవాత్మక మార్పు తీసుకొచ్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు. గతంలో ఆరోగ్యశ్రీకి సంబంధించి కేవలం 800 జబ్బులు మాత్రమే ఉండేవని, సీఎంగా జగన్ పగ్గాలు చేపట్టాక 3,100 జబ్బులను ఆరోగ్యశ్రీలో చేర్చారన్నారు. అదే విధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రతి ప్రాంతంలో ఏర్పాటు చేసి పేదలకు వైద్యాన్ని చేరువ చేశారన్నారు. విలేజ్ డాక్టర్‌తో పాటు, ప్రస్తుతం కొనసాగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ద్వారా పేదల ఆరోగ్యంపై భరోసా కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని విజయకేతనం ఎగురవేసేందుకు వైద్యులు కీలక పాత్ర పోషించాలన్నారు.

# సమాజంలో సైన్ లాంగ్వేజ్ వ్యక్తులను సమానంగా చూడాలి



అంతర్జాతీయ సైన్ లాంగ్వేజ్ డే పోస్టర్లు విడుదల చేస్తున్న రంగరాజు, మధుసూదనరావు, సువార్త

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలో సైన్ లాంగ్వేజ్ వ్యక్తులను అందరితో సమానంగా చూడాలని హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు పేర్కొన్నారు. మంగళవారం అమరావతి రోడ్డులోని కళాశాలలో అంతర్జాతీయ సైన్ లాంగ్వేజ్(మూగ, చెవుడు) దినోత్సవాన్ని నిర్వహించారు. రంగరాజు మాట్లాడుతూ పుట్టుకతో వివిధ శారీరక లోపాలకు గురైన వ్యక్తులకు సమాజం అండగా నిలవాలని, శారీరక లోపాలు కలిగిన వారిలో అద్భుతమైన మేధా సంపత్తి, నైపుణ్యాలు ఉంటాయని అన్నారు. ఈసందర్భంగా సైన్ లాంగ్వేజ్ ప్రతినిధులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, అసిస్టెంట్ డైరెక్టర్ ఏ సువార్త, జిల్లా అధ్యక్షుడు ఎస్.చంటిబాబు, ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవికుమార్, ఓఎస్డీ పి.సీతారామయ్య పాల్గొన్నారు.

# బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ సాయం



చెక్కు అందిస్తున్న బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు శ్రీకృష్ణమూర్తి

నగరంపాలెం: కోవిడ్-19 బాధితులతో పాటు ఐదేళ్లుగా పేదల ఆకలి తీరుస్తూ, ఇతరత్రా సామాజిక సేవలు అందిస్తున్న 'గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్' సేవలు అభినందనీయమని బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు శ్రీకృష్ణమూర్తి అన్నారు. బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ తరఫున సేవలు అందిస్తున్న గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులకు రూ.2 లక్షలను మంగళవారం చంద్రమౌళినగర్‌లోని ట్రస్ట్ కార్యాలయంలో శ్రీకృష్ణమూర్తి అందజేశారు. గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక, చైర్మన్ పఠాన్ అల్లా బక్షు మాట్లాడుతూ దాతల సహకారంతో జీజీహెచ్ వద్ద నిత్యాన్నదానం చేస్తున్నామని అన్నారు. పేద ప్రజలకు విద్య, వైద్య, ఇతర సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ ట్రస్టీ పి.ప్రతీష, ఊటుకూరి నాగేశ్వరరావు, పఠాన్ హబీబ్‌బాషా పాల్గొన్నారు.